# అవంతే!



జి.వి. రామ్‌చంద్

"నీళ్ళు పట్టుకున్నాక కొళాయి బంద్ చేయాలని తెలీదూ? ఎన్ని నీళ్లు వృధాగా పోతున్నాయో చూశావా?" అని ఎవరిపైనో అరుస్తున్న సుగుణారావు గొంతు పట్టాను.

అదే సుగుణారావు చెప్పిన ఇల్లని కూడా గుర్తుపట్టాను.

'అయితే వీడికి చిన్నప్పటినుంచీ ఉన్న ఈ అలవాటు పోలేదన్నమాట!' వాడికి దుబారా ఖర్చులు చేయుటం ఏమాత్రం ఇష్టం ఉండేది కాదు. ప్రతిదీ పొదుపుగా వాడుకోవాలంటాడు.

ఆ అలవాటువల్లే ఇల్లు కట్టగలిగాడనిపించింది నాకు. ఇన్నేళ్లు బిజినెస్ చేస్తున్నా, నా కింతవరకూ సొంతిల్లే లేదు

మరి!

సుగుణారావు చిన్నప్పటినుంచి నాకు మంచి మిత్రుడు. డిగ్రీదాకా కలిసే చదువుకున్నాం. వాడికి వాళ్ల నాన్న వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని ఉద్యోగంలో వేయించాడు. నేనుమాత్రం బిజినెస్‌లో దిగాను.

ఉద్యోగ రీత్యా వాడు కర్నూలు చేరాడు. అక్కడే ఇల్లు కట్టించాడు. అక్కడే పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలతో జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నాడు.

నేను ఓ పేరుగల కంపెనీ ఏజెన్సీషిప్ తీసుకోవడానికిగాను కర్నూలుకు రావలసి వచ్చింది. వచ్చినరోజు హోటల్‌లో దిగాను. ఆ రోజు పని కాలేదు. అదే రోజు రోడ్డు మీద నడిచి వస్తుంటే కలిశాడు సుగుణారావు. నేను హోటల్లో దిగిన విషయం విని, కోపగించుకున్నాడు. మర్నాడు తనింటికి రమ్మని ఆహ్వానించాడు. ఇంటి గుర్తులు చెప్పి కనుక్కోవటం తేలికే అన్నాడు. అన్నట్లే వాడిల్లు ఏమాత్రం కష్టపడకుండానే కనుక్కోగలిగాను.

బయటే నిలబడిపోయిన నన్ను చూశాడు. "ఏరా, బయటే నిలబడిపోయావ్? రా, రా!" అని లోపలికి పిలుచుకువెళ్లాడు.

వాడి వెంటే లోపలకు వెళ్లాను. పక్కనే ఉన్న రూమ్ తలుపు తీసి లోపలకి రమ్మన్నాడు. వెళ్లి సోఫాలో కూర్చున్నాను. వెలుగుతున్న ట్యూబ్‌లైట్‌ను ఆఫ్ చేశాడు.

"ఛ! ఛ! ఎన్నిసార్లు చెప్పినా లైటు ఇలాగే వేసుంచేస్తారు! ఎంత కరెంట్ కాలుతుందని? ఒరే, చూశావా... మా ఆవిడకు ఎన్నిసార్లు చెప్పినా లైటు ఇలాగే వేసుంచేస్తుంది! ఒకపక్క గవర్నమెంట్ వాళ్లు సేవ్ పవర్, సేవ్ వాటర్ అని ఎంత ప్రచారం చేస్తే మాత్రం ఏం లాభం? ఆచరించే వాళ్లు లేకపోతే?" అని వాపోయాడు.

వాడు చెప్పింది నిజమేననిపించింది. అనవసర టైములో లైట్లు వేసి ఉంచడం, చూడకపోయినా టీ.వీ.లు ఆన్ చేసి ఉంచటం, ఇక ఫాన్‌లు అయితే ఉదయం వేసి రాత్రి ఆర్పేవాళ్లు ... ఇలా వృథాగా కరెంటును నష్టపరుస్తుంటే కొరత ఏర్పడమంటే ఏర్పడదూ మరి! అని అనుకున్నాను.

ఆ తర్వాత వాడామధ్య కొన్న వస్తువులు గురించి చెప్తూ వాటిని కొనటానికి తనెంత కష్టపడిందీ వివరిస్తున్నాడు. అంతలో టిఫిన్లు వచ్చాయి. తింటూ మాట్లాడుకోసాగాము.

"ఊఁ... చెప్పరా, ఈ రోజు నీ పని అయిపోతుందా?" అని అడిగాడు.

"ఆఁ, అయిపోతుందిరా! సాయంత్రం ఊరెళ్లిపోతాను!" అన్నాను.

"ఏమిటీ... అప్పుడే వెళ్లిపోతావా? ఈ సాయంత్రం ఉండరాదూ, ఏదైనా పిక్చర్‌కెళ్లేవాళ్లం!" అన్నాడు.

"లేదురా, షాపులో నేను లేకపోతే కష్టం. బాకీ వసూళ్లకు కుర్రాణ్ణి పంపాల్సి ఉంటుంది!" అన్నాను.

"సరే, నీ ఇష్టం!" అని, "అయితే ఓ పని చెయ్! సాయంత్రం నీ పని అయిపోగానే మా ఆఫీసుకు వచ్చేయ్! ఇద్దరం కలిసి కాసేపు మాట్లాడుకుందాం!" అన్నాడు.

నేను వాడితో కలవక చాలా నెలలైంది. అందుకే ఆనందంగా ఒప్పుకున్నాను.

ఆ సాయంత్రానికంతా నా పని అయిపోయింది. ఏజెన్సీషిప్ నాకే ఇచ్చారు. దాంతో కాస్త సంతోషంగా ఉంది. రాబోయే లాభాలూహించుకుంటూ వాడి ఆఫీసు చేరాను.

ఆంధ్రదేశంలోని అన్ని గవర్నమెంటు ఆఫీసుల్లాగే అదీ ఉంది. చెక్క బల్లలు, కుర్చీలు, గుట్టలుగుట్టలుగా ఫైళ్లు .... నల్లటి గోడలు, బూజుతో నిండిన పై కప్పులు ....

నేను లోపలికి వెళ్లగానే సుగుణారావు తీరిగ్గా కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు. ఎదురుగా టైపు చేయాల్సిన పేపర్లున్నాయి.

నన్ను చూడగానే, "రా, రా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను. లేకపోతే ఈపాటికి ఇంటికి చెక్కేసేవాణ్ణి!" అని కుర్చీ దగ్గరికి లాగాడు.

నేను వెళ్లి కూర్చున్నాను. అతనితో పరిచయం చేయించాడు. కాసేపు అవీ ఇవీ మాట్లాడాక అతడు వెళ్లిపోయాడు.

అతడున్న హాల్‌లో వరుసగా బల్లలు, కుర్చీలు వేసి ఉన్నాయి. ప్రతి టేబుల్ మీదా గుట్టలు గట్టలుగా ఫైళ్లు దర్శనమిస్తున్నాయి. కుర్చీలు మాత్రం ఖాళీగానే ఉన్నాయి.

పేరుకుపోయిన పనిలా, ఫైళ్లతో నిండుగా టేబుల్స్ ఉంటే, పనిచేయని గవర్నమెంట్ ఎంప్లాయీలా ఖాళీ కుర్చీలున్నాయి.

వారి వారి సీట్లపైన ఫాన్‌లు మాత్రం గిరగర శబ్దం చేసుకుంటూ తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి. ఆ హాల్‌కు చాలానే కిటికీలున్నాయి. కానీ ఆ కిటికీల నుంచి తగినంత వెలుతురు రాకుండా ఫైళ్ల రాక్‌లు అడ్డగిస్తున్నాయి. అందుకే పాపం, ట్యూబ్‌లైట్లు తమ కర్తవ్యదీక్షలో పగలు కూడా చీకటిని మింగే ప్రయత్నం చేస్తున్నాయి.

వాటిని ఆపుచేసే నాథుడే లేడు.

"ఏరా, వెళ్దామా?" అనడంతో నా ఆలోచనలకు స్వస్తి చెప్పి లేచాను. వాడితో బయటకు నడుస్తూ, "ఏరా, వాటిని ఎవరూ ఆఫ్ చేయరా?" అని అడిగాను.

"అవంతేలేరా!" అన్నాడు తేలిగ్గా.

నేను ఆశ్చర్యపోయాను వాడి సీటు దగ్గర కూడా అదే పరిస్థితి సేవింగ్ వాడింటికి మాత్రమే అని తెలుసుకుని.

■

